సంక్షేమ పథకాలే విజయానికి శ్రీరామరక్ష

గణపవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల విజయానికి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా అనుబంధ విభాగాల సభ్యులు, పార్టీ ముఖ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పనిచేసి ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమైన 175 స్థానాలు గెలవాలన్నారు. ఇప్పటి



వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ సంఘాల నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే వాసుబాబు

వరకూ నిర్వహించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పాలన పట్ల పూర్తి నమ్మకంతో, సానుకూల దృక్పథంతో ఉన్నారని అన్నారు. నియోజక వర్గంలో గడపగడకు మన ప్రభుత్వం కార్యక్రమం ఇప్పటివరకూ 147 రోజులు నిర్విరామంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈసమావేశంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వందనప సాయిబాల, యువజన విభాగం పడమటి గిరిబాబు, బీసీ విభాగం గంటా ప్రసాదరావు, ఎస్సీ సెల్ తేడా ఆనంద్, పంచాయతీరాజ్ విభాగం పుప్పాల గోపి, మైనార్టీసెల్ రాజా అహ్మద్, సాంస్కృతిక విభాగం మారిశెట్టి అబ్బులు, చేనేత విభాగం దొంతంశెట్టి సత్యనారాయణ, ప్రచార విభాగం పోల్నాటి శ్రీనివాసరావు, రైతువిభాగం వాసిరెడ్డి మధు, క్రిస్టియన్ మైనార్టీ పిళ్లాచరణ్, సోషల్ మీడియా చిక్కాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేత

భీమడోలు: గుండుగొలనుకు చెందిన ఓ వలంటీర్ విజయవాడవెళ్లి ఓ వృద్ధురాలికి వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్మును అందించింది. గ్రామంలోని బోరింగ్ పేటకు చెందిన వృద్ధురాలు ఓగిరెడ్డి కోటేశ్వరమ్మ విజయవాడలోని తన కూతురు వద్ద ఉంటూ వైద్యం చేయించుకుంటోంది. గుండుగొలను రాలేని స్థితిలో ఉన్న కోటేశ్వరమ్మ వద్దకు వలంటీర్ ఆళ్ల దుర్గాభవానీ మంగళవారం తన సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ సొమ్ము రూ.2,750 అందించింది. దీంతో ఆ వృద్ధురాలి కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. వలంటీర్‌ను పలువురు అభినందించారు.



వృద్ధురాలు కోటేశ్వరమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఆళ్ల దుర్గా భవానీ

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

దెందులూరు: మేధినరావుపాలెం గ్రామానికి చెందిన కే.తిరుపతయ్య ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో అతనికి మే నెలలో మంజూరైన పింఛన్ డబ్బులను వలంటీర్ కుమార్‌రాజు ఆస్పత్రికి వెళ్లి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్‌ను సర్పంచ్ దుర్గాకుమారి రాజు, ఎంపీడీవో ఏబీవీపీ లక్ష్మి అభినందించారు.

నేడు పెదనింద్రకొలనులో 'గడపగడపకు'

నిడమర్రు: గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పెదనింద్రకొలనులో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. దీనిలో భాగంగా జగనన్నే మా భవిష్యత్తు కొనసాగుతుందన్నారు. ఆయా కార్యక్రమాలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు.

అధికారుల గైర్హాజర్‌పై మండిపాటు

దెందులూరు: దెందులూరు మండల సర్వసభ్య సమావేశానికి మండలాధికారులు గైర్హాజరు కావడంపై దెందులూరు మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు అగ్రహం వ్యక్తం చేశారు. దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే గోపన్నపాలెం ఎంపీటీసీ సువ్వా ప్రభుదాసు ముఖ్య అధికారులు సమావేశానికి ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ సమావేశానికి హాజరుకాని అధికారుల పేర్లు చదివి వినిపించారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీడీఓ ఏబీపీపీ లక్ష్మి, మండల వైస్ ఎంపీపీ గొల్లా నాగరాజుతో పాటు ఎంపీటీసీలంతా గైర్హాజరైన మండలాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధికారులకు నోటీసులు జారీ చేసి క్రమశిక్షణా చర్యలు నిమిత్తం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి మండల సర్వసభ్య సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,ఎంపీడీఓ లక్ష్మి, ఏపీఓ దశరథ రాంజీ, ఏఓ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కాలభైరవి ఉత్సవాలు

పెదవేగి : మండలంలో కాలభైరవి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గారపాటి సీతా రామాంజనేయ చౌదరి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, బాలికలతో కోలాట నృత్య ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. కమిటీ చైర్మన్ తాతా శారద, గౌరవ అధ్యక్షుడు రాజులపాటి బాపనయ్య, ఉండవల్లి వెంకటరావు, రమేష్ పాల్గొన్నారు

11 ఆర్‌బీకేలకు ట్రాక్టర్లు, పనిముట్ల మంజూరు

దెందులూరు: మండలంలో 11 ఆర్‌బీకేల్లో ట్రాక్టర్లు, పనిముట్లు మంజూరయ్యాయని వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఏ.సుబ్బారావు తెలిపారు. మంగళవారం కొవ్వలి కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సబ్సిడీతో రూ. 17 లక్షలు విలువ చేసే ట్రాక్టర్, పనిముట్లు, మంజూరు చేశామన్నారు. సమావేశంలో కొవ్వలి కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, దెందులూరు ఏఎంసీ చైర్మన్ కాటి సుధాకర్, దెందులూరు ఏఓ గద్దె రమేష్, కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

భీమడోలు: గుండుగొలనులోని వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 6వ తేదీతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. సోమవారం స్వామి వారిని పెళ్లి కుమారునిగా ముస్తాబు చేసారు. బుధవారం రాత్రి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ ఈవో డి.శంకరరావు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు, పూజారి కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి బాధ్యతతో చదువుకోవాలి

పెదవేగి : ప్రతి విద్యార్థి బాధ్యతతో చదువుకోవాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. మంగళవారం మండంలోని వంగూరు, జానంపేట, విజయరాయి, జగన్నాథపురం, సూర్యారావుపేట గ్రామ పంచాయతీలు సందర్శించి బడి బయట ఉన్న పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్దూరి సూర్యనారాయణమూర్తి మృతి

ఉంగుటూరు: ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారిగా రెండు దశాబ్దాలు పనిచేసిన మద్దూరి సూర్యనారాయణమూర్తి (67) మృతిచెందారు. ఆయన కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్సపొందుతూ మంగళవారం కన్నుమూశారు. అంత్యక్రియలు స్వగ్రామం చేబ్రోలులో నిర్వహించారు. భీమవరంలో ఉంటున్న ఆయన హైదరాబాదులో చికిత్స పొందారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా, గౌరవ అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. భీమవరంలో ఉపవిద్యాశాఖాధికారిగా సూర్యనారాయణమూర్తి పదవీ విరమణ చేశారు. ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు చేబ్రోలు వెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నేడు సకల కొత్తపల్లిలో 'గడపగడపకు'

పెదపాడు: మండలంలోని సకల కొత్తపల్లి గ్రామ సచివాలయంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3గంటల నుంచి జరిగే ఈకార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

దోమల నివారణకు కీటక నియంత్రణ అవసరం

ఉంగుటూరు: దోమలు నివారణకు కీటక నియంత్రణ చర్యలు అవసరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. చేబ్రోలు, కాగుపాడు పీహెచ్‌సీ కేంద్రాల్లో మంగళవారం ఆషా డే సమావేశం నిర్వహించారు. డా. వర్మ, డా. డిజోషిరాయ్, ఆరోగ్య అధికారి పి. పద్మ, విస్తరణ అధికారి కె. శ్రీనివాసరావు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

పెదవేగి : స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశావర్కర్ల సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్, డాక్టర్ మాధవి, డాక్టర్ పూర్ణిమ, సీహెచ్ఓ రోజ్‌మేరీ, సూపర్‌వైజర్స్ పాల్గొన్నారు.

పెదపాడు: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టరు అనంతపాల్ శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బందికి ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్ఓ రామలక్ష్మి, ఎంపీహెచ్ఈఓ పార్వతీశం పీహెచ్ఎన్ కల్పనా పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు

భీమడోలు: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని వైసీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం భీమడోలులో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. విశాఖ ఉక్కును రక్షించుకునేందుకు బుధవారం ఉదయం భీమడోలు జంక్షన్‌లో అన్ని పార్టీల మద్దతుతో రాస్తారోకో చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఆర్.లింగరాజు అధ్యక్షత వహించారు. మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు రక్షణకు చేపట్టిన ఉద్యమానికి వైసీపీ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతును ప్రకటించిందన్నారు. వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, జిల్లా చైతన్య యువజన సంఘాల అధ్యక్షుడు డాక్టర్ పాము మాన్‌సింగ్, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాకిన సత్యనారాయణ, నాయకులు పైడిమాల యుగంధర్, కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ

గణపవరం: గణపవరం వైఎస్సార్ కాలనీలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయంలో ఈనెల 3వ తేదీ బుధవారం శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నిర్మించిన యాగశాలలో మూడు రోజులుగా వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. టీటీడీ ఆలయ సన్నిధిగొల్ల కిషోర్‌యాదవ్ దంపతులు మంగళవారం పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు యంత్రస్థాపన, ధ్వజస్థాపన పూజలు, ఆలయ ప్రవేశం, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించి, విగ్రహాన్నిప్రతిష్ఠిస్తారు.